ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 14 ఆగస్టు 2024

మదనపల్లె వారపుసంత వద్ద ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్



మదనపల్లెలో రేపు రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభం

మదనపల్లె టౌన్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్న క్రమంలో జిల్లాలో మదనపల్లెలోనే రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక వారపు సంత వద్ద గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను, కదిరి రోడ్డు మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ అధికారులు అన్ని వసతులతో సిద్ధం చేశారు. ఈ రెండు అన్న క్యాంటీన్లను ఈనెల 15వ తేదీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు. అనంతరం 16వ తేదీ నుంచి నిత్యం మూడు పూటలా అన్నక్యాంటన్‌లో భోజనం అతి తక్కువ ధరలతో (ప్లేటు రూ.5) వడ్డించనున్నారు. ఉదయం అల్పాహారంగా 3 ఇడ్లీ, చట్నీ, సాంబార్/ 250 గ్రాముల ఉప్మా, చట్నీ, పొడి, సాంబార్/ 3 పూరీలు, కుర్మా/ 250 గ్రాముల పొంగళ్, చట్నీ, సాంబార్, 25 గ్రాముల మిక్సర్ వడ్డించనున్నారు. అలాగే మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా 400 గ్రాముల అన్నం, 100 గ్రాముల కూర, 15 గ్రాముల పచ్చడి, 120 గ్రాముల పప్పు/ సాంబార్, 75 గ్రాముల పెరుగు వడ్డించనున్నారు. ఉదయం అల్పాహారం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు, రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు అన్న క్యాంటీన్లలో అల్పాహారం, భోజనం వడ్డించనున్నారు. ఆదివారం అన్న క్యాంటీన్లకు సెలవు ప్రకటించారు.

జిల్లాలో 98 డెంగ్యూ, 9 మలేరియా కేసులు

● జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

తంబళ్లపల్లె, ఆగస్టు 13: జిల్లాలో 98 డెంగ్యూ కేసులు, 9 మలేరియా కేసులు నమోదయ్యాయని, దోమల లార్వాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) వేణుగోపాల్ తెలిపారు. తంబళ్లపల్లెలో మూడు డెంగ్యూ కేసులు నమోదు కావడంతో మంగళవారం ఆయన మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులుతో కలసి తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. వైద్యాధికారి వెంకట్రామయ్యతో కలసి ల్యాబ్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం పట్టణంలోని డెంగ్యూ జ్వర బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 98 డెంగ్యూ కేసులు నమోదు కాగా అందులో మదనపల్లె డివిజన్‌లోనే 39 నమోదయ్యాయని, జిల్లాలో మలేరియా కేసులు 9 నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలలో ఇంటింటి ఫీవర్ సర్వే, యాంటి లార్వా ఆపరేషన్(ఏఎల్వో) నిర్వహించి అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో డెంగ్యూ, మలేరియా జ్వరాల నిర్ధారణ (హెచ్ఎస్1 ర్యాపిడ్) పరీక్షలు చేసే అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఈ పరీక్షలను ఉచితంగా చేస్తారని అన్నారు. అధిక జ్వరం, తలనొప్పి, తీవ్రమైన కీళ్లనొప్పులు, వాంతులు, అలసట, దద్దుర్లు డెంగ్యూ జ్వరం లక్షణాలని.. ఈ లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్సలు తీసుకుని మందులు వాడాలని సూచించారు.


తంబళ్లపల్లెలో జ్వర బాధిత ఇళ్ల వద్ద పర్యటిస్తున్న డీఎంవో వేణుగోపాల్

ఇష్టారాజ్యంగా ఇచ్చేశారు..

- ఫ్రీహోల్డ్ భూములు సక్రమమేనా!
- వైసీపీ ప్రభుత్వ అనుమతులపై అనుమానాలు
- ముమ్మరంగా సాగుతున్న పునర్విచారణ
- వెలుగులోకి రానున్న భూబాగోతాలు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో 35,763 ఎకరాలకు ఫ్రీహోల్డ్

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. సహజ వనరులను దోపిడీ చేశారు. గుట్టలు, చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపించినా అక్కడ పాగా వేసేశారు. వైసీపీ నాయకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగింది. కొందరు అధికారులు కూడా వైసీపీ నాయకులతో అంటకాగి ప్రభుత్వ భూములను వారికి కట్టబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఈ అక్రమాలకు అంతే లేకుండాపోయింది. ప్రభుత్వ భూముల రికార్డులు మార్చేసి ఫ్రీహోల్డ్ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ 35,763 ఎకరాలకు ఫ్రీహోల్డ్ ఇచ్చారంటే అక్రమాలు ఎంత స్థాయిలో జరిగాయో ఇట్టే అర్థమవుతుంది.


ములకలచెరువు సమీపంలో ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ (ఫైల్)



తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఫ్రీహోల్డ్ ఇచ్చిన వివరాలు..

మండలం	ఎకరాలు
పెద్దమండ్యం	9,293
బి.కొత్తకోట	6,162
పెద్దతిప్పసముద్రం	7,494
తంబళ్లపల్లె	4,153
కురబలకోట	3,704
ములకలచెరువు	4,957
మొత్తం	35,763 ఎకరాలు


ములకలచెరువులోని రికార్డుల గది

ములకలచెరువు, ఆగస్టు 13: వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీహోల్డ్ భూములు సక్రమమేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇష్టారాజ్యంగా ఫ్రీహోల్డ్‌కు అనుమతులు ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల రికార్డులు మార్చేసి ఫ్రీహోల్డ్ ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్క తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే 35,763ఎకరాలకు ఫ్రీహోల్డ్ ఇవ్వడం వెనుక బడా నేతల హస్తం ఉన్నట్లు వెల్లడవుతోంది. అనుమానం రాకుండా సక్రమమైన భూములకు ఫ్రీహోల్డ్ ఇచ్చి ఈ ముసుగులో ప్రభుత్వ భూములు, సమస్యాత్మక భూములకు ఫ్రీహోల్డ్ పొంది కొందరు సొమ్ము చేసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం తంబళ్లపల్లె నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు ఫ్రీహోల్డ్ ఇచ్చి రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇచ్చింది. అలాగే అంతకు మునుపు కూడా కొన్ని భూములకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు కాల్చివేయడం, వైసీపీ బడా నేతల భూబాధితులు భారీగా బయటకు రావడంతో ఈ ప్రాంతంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలు, అన్యాయాలు వెలుగులోకి వచ్చాయి. భూబాధితులు నేరుగా రెవెన్యూ ఉన్నతాధికారులను కలిసి తమ భూములు అన్యాయంగా లాక్కున్నారని ఫిర్యాదులు చేశారు. ఫ్రీహోల్డ్ భూముల్లో చోటు చేసుకున్న అక్రమాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఫ్రీహోల్డ్ భూములన్నింటిపై విచారణకు ఆదేశించింది. దీంతో ఫ్రీహోల్డ్ భూములపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో పునర్విచారణ జరుపుతున్నారు. ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతోంది. ములకలచెరువు సమీపంలోని తంబళ్లపల్లె-ములకలచెరువు రోడ్డు పక్కన ఉన్న గుట్టకు ఫ్రీహోల్డ్ ఇచ్చిన విషయం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తనిఖీల్లో బయటపడడం చర్చనీయాంశమైంది. అలాగే బి.కొత్తకోట మండలంలో కూడా ప్రభుత్వ గయాలు గుట్టకు ఫ్రీహోల్డ్ ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇచ్చిన ఫ్రీహోల్డ్ భూముల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి అక్రమాలు, రికార్డుల తారుమారు జరిగినట్లు వెలుగులోకి వస్తున్నాయి.

చేతులు మారిన భూములపై విచారణ

తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన దాదాపుగా ముగింపు దశకు చేరుకుంది. ఫ్రీహోల్డ్ అనంతరం చేతులు మారిన భూములపై కూడా విచారణ సాగుతోంది. గతంలో భూములు ఎవరి పేరున ఉన్నాయి. ప్రస్తుతం ఎవరు కొన్నారు.. రిజిస్ట్రేషన్లు ఎక్కడ జరిగాయి.. ఎవరి ఆధీనంలో ఉన్నాయోనన్న కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. ఈ విచారణ పూర్తయితే వైసీపీ బడా నేతలు చేసిన భూబాగోతాలు వెలుగులోకి రానున్నాయి. దీంతో వైసీపీ నేతలకు సహకరించిన రెవెన్యూ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు, సిబ్బంది కొందరు వైసీపీ బడా నేతలకు సహకరించినట్లు తెలుస్తోంది.

టెన్‌వన్ మాయంపై అనుమానాలు

ములకలచెరువు టెన్‌వన్ మాయంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన టెన్‌వన్ కనిపించకపోవడంతో రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ములకలచెరువు టెన్‌వన్ ఏమైందన్నది చర్చనీయాంశంగా మారింది. 1915లో జరిగిన రీసర్వే అనంతరం రెవెన్యూ శాఖ ప్రతి గ్రామానికి టెన్‌వన్ రిజిస్టర్‌ను అమలులోకి తీసుకొచ్చింది. 1915 నుంచి ఇచ్చిన పట్టాలు, అసైన్డ్ పట్టాలు అందులో నమోదు చేస్తూ వచ్చారు. ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌పై పునఃపరిశీలనకు ఆదేశించడంతో రెవెన్యూ సిబ్బంది టెన్‌వన్ కోసం కార్యాలయం మొత్తం జల్లెడ పట్టినా కనిపించలేదు. ఇటీవల ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనకు వచ్చిన మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ ములకలచెరువు టెన్‌వన్ గురించి అడగ్గా కనిపించలేదని సమాధానం చెప్పడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ములకలచెరువు టెన్‌వన్ కోసం రికార్డుల గది మొత్తం వెతకాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది మళ్లీ ఓమారు రికార్డుల గదిలో వెతికినా కన్పించలేదు. దీంతో అసలు ములకలచెరువు టెన్‌వన్‌ను మాయం ఎవరో మాయం చేశారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

అన్యాక్రాంతమైన భూములు వెనక్కి తీసుకుంటాం..



తంబళ్లపల్లె నియోజకవర్గంలో అన్యాక్రాంతమైన భూములను వెనక్కు తీసుకుని ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతాను. నియోజకవర్గంలో 35,763 ఎకరాలకు గత వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ ఇచ్చింది. ఇందులో ప్రభుత్వ భూములు, గుట్టలకు ఫ్రీ హోల్డ్ ఇచ్చారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్య పూర్తిగా తొలగిపోతుంది. ముఖ్యంగా బి.కొత్తకోట, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల్లో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో భూములను ఆక్రమించుకున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో మొత్తం 70 వేల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. వీటన్నింటిని స్వాధీనం చేసుకుని భూబాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాము.

- దాసరిపల్లి జయచంద్రారెడ్డి, నియోజకవర్గ టీడీపీ నేత

ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించిన జేసీ

రామాపురం, ఆగస్టు 13: మండలంలోని గోపగుడిపల్లె గ్రామంలోని సర్వే నెంబర్ 756/3లోని ఫ్రీహోల్డ్ భూములను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని రామాపురంలో ఉన్న సరస్వతిపల్లె సహకార బ్యాంక్‌ను తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సహకార బ్యాంకులో ప్రతి రైతుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేశారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4400 ఎకరాలు ఫ్రీహోల్డ్ భూములను గతంలో గుర్తించారని వాటిని పరిశీలించి అక్రమాలు జరగకుండా చూడాలని ఆయన వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ రవికుమార్, సొసైటీ సీఈవో నాగేశ్వర్‌రెడ్డి, మండల సర్వేయర్ నాగలక్ష్మి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.


రామాపురంలో ఫ్రీహోల్డ్ భూమిని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ


రాయచోటిలో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయచోటి కలెక్టరేట్, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయచోటి పట్టణంలో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, డీఎస్పీ రామచంద్రరావు, డీఎఫ్‌వో అనిల్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి అన్నమయ్య సర్కిల్ మీదుగా మాసాపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వరకు నిర్వహిచారు. ర్యాలీలో శ్రీచైతన్య హైస్కూల్, రాజు హైస్కూల్, గిరిజన పాఠశాల, సాయి హైస్కూల్, సాయి ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ టెక్నికల్ కళాశాల తదితర విద్యాసంస్థల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్ర మంలో చివరిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞను జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం చేయించి కార్యక్రమాన్ని ముగించారు.

అట్టహాసంగా ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు


బీసెంట్ సర్కిల్ వద్ద విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, ఆగస్టు 13: విద్యార్థుల దేశభక్తి నినాదాలతో మదనపల్లె పట్టణం మార్మోగింది. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా మదనపల్లె పుర వీధులు విద్యార్థుల భారీ ర్యాలీతో పులకరించిపోయింది. మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక మిషన్ కాంపౌండు నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు వేలాదిగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చిత్తూరు బస్టాండు, అవెన్యూరోడ్డు, బెంగళూరు బస్టాండు మీదుగా అనిబిసెంట్ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా అనిబిసెంట్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె పట్టణ ప్రజలు దేశ సమగ్రతకు చిహ్నంగా నిలుస్తున్నారని, మూడు రోజుల పాటు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో బుధవారం మెప్మా, వెలుగు సంఘాల మహిళలతో ర్యాలీ నిర్వహిస్తామని, సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక టిప్పుసుల్తాన్ మైదానంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పద్మశ్రీ శోభరాజ్ సంకీర్తన కచేరి నిర్వహిస్తారన్నారు. రాత్రి 12.33 గంటలకు మువ్వన్నెల జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు, టీడీపీ, జనసేన నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సీడీ-4 కౌంట్ యంత్రం ప్రారంభం

మదనపల్లె టౌన్, ఆగస్టు 13: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో రూ.24 లక్షల విలువ చేసే సీడీ-4 కౌంట్ యంత్రం సేవలు ప్రారంభించామని మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గతంలో మదనపల్లె ఆస్పత్రికి వచ్చే హెచ్ఐవీ నిర్ధారిత బాధితులు సీడీ-4 కౌంట్ పరీక్షలకు శాంపిల్ తిరుపతి రుయా ఆస్పత్రికి పంపేవారమన్నారు. ఇక మీదట సీడీ-4 కౌంట్ పరీక్షలు ఇక్కడే నిర్వహించవచ్చన్నారు. తెల్లరక్త కణాలు తక్కువగా ఉంటే ఈ పరీక్షలు చేసి దానికి అనుగుణంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మాంజలి దేవి, ఆర్ఎంవో ప్రసాదరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో సీడీ-4 కౌంట్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 13: రాష్ట్రంలో భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంత్రి అధ్యక్షతన రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ఐదు సంవత్సరాలలో చేయవలసిన పని ఏదైనా ఉందంటే అది రైతు కంట్లో నీళ్లు తుడవడమే అన్నారు. దానిని నెరవేర్చడానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. భారతదేశ వ్యవస్థలో తల్లి తరువాత మనం పూజించేది భూమిని అనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి భూములు మనకు వంశపారంపర్యంగా సంక్రమిస్తాయి కాబట్టి వాటికి వారసులు అజమాయిషీగా ఉంటున్నారని వారు తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లినా మాకు ఆన్‌లైన్ కావడం లేదు, మాకు పాసు పుస్తకాలు ఇవ్వడం లేదు, వన్‌బీ అడంగల్ ట్యాంపరింగ్ జరిగిందని ఇలా చాలా సమస్యలు మా దృష్టికి వచ్చాయని మంత్రి తెలిపారు. కొంతమంది రెవెన్యూ అధికారులు చేతివాటం చూపించి ఐదు సంవత్సరాలలో రైతులను చాలా ఇబ్బందులకు గురి చేశారన్నారు. పొలం అమ్ముకుని పిల్లలకు పెళ్లిళ్లు చేయాలన్నా, లేక చదువుల విషయంలో ఆస్తిని అమ్ముకోలేక రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. ఈ సమస్యలను త్వరగా గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం అధికారులను గ్రామాలకు పంపి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెవెన్యూపరంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా భూసమస్యల పరిష్కారానికి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై శాసనసభ్యులు, వివిధ పార్టీల ప్రతినిధులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణ, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా కన్వీనర్ సాయి లోకేశ్, తంబళ్లపల్లె నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, తదితరులు

పొలాల్లోకి వర్షపు నీరు



వాల్మీకిపురం, ఆగస్టు 13: వాల్మీకిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లె మార్గంలో భూములను చదును చేసుకుని వంక ప్రాంతాన్ని కనుమరుగు చేయడంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో నీరంతా పొలాల్లోకి వస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న వంక ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కనుమరుగు చేయడంతో వంక నీరంతా పొలాల్లోకి వస్తోందని, పశువుల కొట్టాలు, పంటలు, కూరగాయల తోటలు కూడా నీటి పాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లె మార్గంలోని వ్యవసాయ పొలాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని, వంక ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ కమలాకర్‌రెడ్డి తెలిపారు.

చెరువులకు ఏటా రెండు సార్లు నీరందిస్తాం: ఎమ్మెల్యే



ఎర్రచెరువు తూమును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్ ఆగస్టు 13: చెరువులకు ఏటా రెండు సార్లు నీరందించి, రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. దువ్వూరు మండలంలో మంగళవారం ఎస్ఆర్ 1 నుంచి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె వరకు తెలుగుగంగ అధికారులను వెంటపెట్టుకుని ఎమ్మెల్యే కాల్వ కట్టమీద 18 కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ సుమారు ప్రయాణం చేశారు. ప్రయాణంలో లైనింగ్ లేని కాల్వను పరిశీలించారు. తూములకు వెంటనే గేట్లు బిగించాలని అధికారులను ఆదేశించారు. చాలా చోట్ల లైనింగ్ లేక పోవడంతో నీరు వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులకు నీరు వెళుతున్న తూములకు వెంటనే గేట్లు బిగించాలని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో 0-18 కిలో మీటర్ వరకు లైనింగ్ పనులు జరగడంతోనే నేడు మనకు నీరు పుష్కలంగా వస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు నీటిని నింపిన తరువాతే బ్రహ్మంసాగర్‌కు నీటిని పంపిస్తామన్నారు. డిసెంబర్‌లో మళ్లీ చెరువులకు నీటిని నింపడంతో సాగు, తాగునీటి సమస్య కూడా లేకుండా పోతుందన్నారు. అనంతరం శెట్టివారిపల్లె శివశంకర్‌రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నాడు. కార్యక్రమంలో ఎస్ఐలు మద్దిలేటి, వినోద్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, దువ్వూరు మండల అధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, ఐ టీడీపీ రాష్ట్ర నేతలు కొండపల్లి ఉమాకాంత్, కటార్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవి ఫిట్‌నెస్ లేని వ్యాన్లు..!

పరిమితికి మించి విద్యార్థుల సంఖ్య ● ప్రమాదాలకు కారణమవుతున్న వైనం ● నామమాత్రంగా అధికారుల తనిఖీ



ఓబులవారిపల్లె మండలంలో బోల్తాపడిన స్కూల్ వ్యాన్ (ఫైల్‌ఫొటో) - స్కూల్ వ్యాన్ల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ బాబు

రైల్వేకోడూరు, ఆగస్టు 13: ఫీజుల కింద వేలకు వేల రూపాయలు గుంజుతూ ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. స్కూళ్ల వ్యాన్లకు ఫిట్‌నెస్ లేకపోవడంతో అవి అదుపు తప్పి ప్రమాదాలకు గురువుతున్నాయి. డ్రైవర్లు వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంతో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్కూలు వాహనాల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో వేసుకుని వెళుతున్నారు. పట్టణం కంటే గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రైవేటు స్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్కూళ్ల యాజమాన్యాల వారు రాజకీయ పలుకుబడి కలిగి ఉండడంతో ఎన్ని ప్రమాదాలు, వివాదాలు జరిగినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్కూల్ వ్యాన్ డ్రైవర్ కారణంగా ఓబులవారిపల్లెలో రెండో తరగతి చదువుతున్న భవిష్యరెడ్డి బలైంది. స్కూళ్ల వ్యాన్లకు ఏడాదికి ఒకసారి అధికారులు పరీక్షించి ఫిట్‌నెస్‌ను ధృవీకరించాల్సి ఉంది. కొందరు డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా, అతివేగంతో వాహనాలు నడుపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉదయాన్నే క్యారీ కట్టించి స్కూలుకు విద్యార్థులను పంపిన తల్లిదండ్రులకు పిల్లలు సాయంత్రం ఇంటికి చేరే వరకు నమ్మకం లేని విధంగా స్కూళ్ల వ్యాన్ల పరిస్థితి తయారైంది. పిల్లలను వ్యాను ఎక్కించిన తర్వాత డోర్లు వేసుకోకుండా వెళుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వ్యాన్లు అతివేగంగా వెళుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి స్కూళ్ల వ్యాన్ల డ్రైవర్లు, యజమానులకు ఆర్టీఏ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చేవారు. విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారే తప్ప విద్యార్థులకు సరైన భద్రత కల్పించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెలలో ఒక చిన్న ప్రమాదమైనా జరుగుతోందని విద్యార్థులు వాపోతున్నారు. కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలను నడుతున్నారని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పుల్లంపేట మండలంలో 4 స్కూళ్లు, పెనగలూరు మండలంలో 10, కోడూరు మండలంలో 26, ఓబులవారిపల్లె మండలంలో 12, చిట్వేలి మండలంలో 4 ప్రైవేటు స్కూళ్లకు వ్యాన్లు ఉన్నాయి. అధికారులు నామమాత్రంగా డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని, వాహనాల ఫిట్‌నెస్‌పై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కూళ్ల వ్యాన్లకు ఫిట్‌నెస్‌లు ఉన్నాయి

ప్రైవేటు స్కూళ్ల వ్యాన్లకు ఫిట్‌నెస్‌లు ఉన్నాయని రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. లైసెన్సులు ఉన్న వారే వాహనాలను నడపాలని, మద్యం మత్తులో వాహనాలను నడపరాదని సూచించారు. ఏడాదికి ఒక్కసారి వాహనాలను సక్రమంగా పరిశీలించి ఫిట్‌నెస్ ఇస్తామన్నారు. ఓబులవారిపల్లె మండలంలో జరిగిన స్కూల్ వ్యాన్ ప్రమాదంపై ఆరా తీశామని తెలిపారు. విద్యాశాఖ అధికారులు ఏడాదికి ఒకసారి స్కూల్ వ్యాన్ల స్థితిగతులను పరిశీలిస్తామని రైల్వేకోడూరు ఎంఈఓ పోతురాజు రామయ్య తెలిపారు. లైసెన్సులు తదితర వాటిని పరిశీలిస్తామని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా స్కూల్ డ్రైవర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సీఐ టి.బాబు తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● ప్రజాదర్బార్‌కు విశేష స్పందన : మంత్రి మండిపల్లి



మహిళల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 13: భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంత్రి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరై తమ సమస్యలు మంత్రికి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలు, భూకబ్జాలపై ఎక్కువ సమస్యలు వస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 15వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి శాశ్వత భూసమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. దాదాపు 45 రోజులు జరిగే రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. ప్రజలంతా రెవెన్యూ సదస్సులకు హాజరై తమ సమస్యలు అధికారులకు తెలిపి పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అన్ని శాఖల అధికారులు సీరియస్‌గా తీసుకుని ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇక నుంచి శాశ్వత భూసమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

గిరిజనులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 13: బీఎడ్, డీఎడ్, టెట్ ఉత్తీర్ణులైన గిరిజన నిరుద్యోగులకు తిరుపతిలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.సరస్వతి పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు విద్యాశాఖ నిబంధనల మేరకు ఉండాలని సూచించారు. మెరిట్ ఆధారంగా లేదంటే ఏదైనా స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని వివరించారు. అర్హులైన గిరిజన యువత బయోడేటా, విద్యార్హత పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, రెండు కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు బీఎడ్, డీఎడ్, టెట్ మార్కుల జాబితా కాపీలను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, కలెక్టరేట్ డి-బ్లాక్, కడప చిరునామాకు పంపాలన్నారు. 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చేర్చాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీడీతో టీడీపీ నేతల వాగ్వాదం



ఏపీడీ నాగరత్నమ్మతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చాపాడు, ఆగస్టు 13: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి సామాజిక తనిఖీ సదస్సులో డ్వామా అదనపు పీడీ నాగరత్నమ్మతో మండల టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. 2023-24లో మండలంలో జరిగిన రూ.7.50 కోట్ల అభివృద్ధి పనులపై ఈ సదస్సులో చర్చించారు. నాగరత్నమ్మ పంచాయతీలవారీ జరిగిన అభివృద్ధిపై చేసిన విచారణను డీఆర్‌పీలు చదివి వినిపించారు. మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో రూ.22,664 అవకతవకలు జరిగినట్లు డీఆర్‌పీలు వివరించారు. ఈ డబ్బు రికవరీ చేయాలని ఏపీఓ జగదీష్‌ను ఏపీడీ ఆదేశించారు. పల్లవోలు, చాపాడు, అల్లాడుపల్లె, చియ్యపాడు, అన్నవరం, ఖాదర్‌పల్లె గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరుపై టీడీపీ నేతలు, కార్యకర్తలు ఏపీడీకి వినతి పత్రాలు ఇచ్చారు. వారి ఫిర్యాదులపై విచారణకు ఆదేశిస్తానని తెలిపారు. సిద్దారెడ్డిపల్లె, తప్పెట ఓబాయపల్లె, ఖాదర్‌పల్లె, లక్ష్మీపేట, పల్లవోలు, చిన్నగురవలూరుల్లో కొంతమేర డబ్బు తేడా కనిపించినట్లు ఏపీడీ చెప్పారు. ఇంతకుమునుపు ఏపీఓగా పనిచేసిన పద్మారాణి ఖాదర్‌పల్లెలో జరిగిన పనులకు సంబంధించిన 135 మస్టర్లలో సంతకాలు ఎందుకు చేయలేదని నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు ఏం చేశావని, ఎందుకు సంతకాలు చేయలేదని నిలదీశారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పద్మారాణికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఏపీడీ చెప్పారు. చియ్యపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ సభలకు సంబంధించి దండోరా ఎందుకు వేయలేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. మొత్తానికి ఉపాధి సిబ్బందికి భయం లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



గండి అంజన్నను దర్శించుకున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చక్రాయపేట, ఆగస్టు 13: గండి క్షేత్రంలో జరిగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. తొలుత ఆయన గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ పూజలు జరిపించి హారతులు అందుకున్నారు. అనంతరం శాలువ పూలమాల వేసి సత్కరించారు. శ్రావణ మాసం ఏర్పాట్లు, భక్తుల రాకపోకల గురించి అడిగి తెలుసుకున్నారు. రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి ఆంజనేయస్వామి మహిమలను చరిత్ర, మకరతోరణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు రంగనాథ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మినీ బస్సు బోల్తా - ఒకరి మృతి

10 మందికి గాయాలు ● సత్యసాయి జిల్లాలో ఘటన ● మృతుడు సింహాద్రిపురం వాసి



హరి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు - (ఇన్‌సెట్‌లో) హరి(ఫైల్‌ఫొటో)
క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

తాడిపత్రి/సింహాద్రిపురం, ఆగస్టు 13: సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని దాడితోట అదానీ హైడల్ పవర్ ప్రాజెక్టు వద్ద మినీ బస్సు బోల్తా పడింది. దీంతో కడప జిల్లా వాసి బోనాల హరి(37) మృతి చెందగా మరో పది మంది గాయపడినట్లు ఎస్ఐ నాగాస్వామి తెలిపారు. మృతుడి భార్య ఉమా మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు... కడప జిల్లా సింహాద్రిపురం మండలం కసనూరు వాసులు బోనాల హరి, భార్య ఉమామహేశ్వరి, కుమారుడు తనీష్ ద్విచక్రవాహనంలో వెలిదండ్లకు వచ్చి అనంతపురం వెళ్తున్న మినీ బస్సు ఎక్కారు. అక్కడి నుంచి బస్సులోని వారితో కలిసి అనంతపురంలోని ఎస్ఎన్ హెర్బల్ న్యూట్రిషన్ వారు నిర్వహిస్తున్న సమావేశానికి బయల్దేరారు. దాడితోట వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో బోనాల హరి అక్కడికక్కడే మృతి చెందగా ఉమామహేశ్వరి, బాలచంద్రారెడ్డి, గోపాల్, శైలజ, దినేష్, హారిక, పెద్దవీరయ్య, హసూరీబీ, బాబా, రెడ్డమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని పులివెందుల వైద్య కళాశాలకు 108లో తరలించారు. డ్రైవర్ షేక్ మాబుషరీఫ్ మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఘటనా స్థలంలో మృతుడు బోనాల హరి కుమారుడు రోధించిన తీరు పలువురిని కలిచివేసింది. తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడాతున్న తండ్రిని చూసి 'భయపడకు డాడీ, నీకు ఏమీకాదు' అంటూ రోధించడం చూసిన వారందరూ కన్నీటిపర్వంతమయ్యారు. ఎస్ఐ నాగాస్వామి కేసు నమోదు చేసుకుని బాధితులను విచారించేందుకు పులివెందులకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించినట్లు తెలిపారు. కాగా మృతుడు హరి సింహాద్రిపురంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సోదరుడు టీడీపీ నేత జయభరత్ రెడ్డి హరి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, బీటెక్ రవి ద్వారా ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పలువురు ఫొటోగ్రాఫర్లు హరి మృతదేహానికి నివాళులు అర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.2.25లక్షల నగదు స్వాధీనం


ముద్దనూరు ఆగస్టు13: యామవరం గ్రామ సమీప కంపచెట్లలో పేకాడుతున్న 16 మందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు వివరాలు.. యామవరం వద్ద కొందరు పేకాడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి 16 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నాము. వారి వద్ద నుంచి రూ.2.25లక్షలు నగదు, 13 మొబైల్స్ రెండు కార్లు, 2రెండు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేంపల్లెలో చోరీ

స్కూటీ నుంచి రూ.30వేలు అపహరణ

వేంపల్లె, ఆగస్టు 13: వేంపల్లెలో స్కూటీలో ఉంచిన రూ.30వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించారు. సోమవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో స్కూటీలో ఉంచి కోడూరు రామచంద్రారెడ్డి పాలు, పెరుగు కోసం దుకాణంలోకి వెళ్లాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రూ.30వేలు నగదు దొంగిలించాడు. బ్యాంకులో లోను చెల్లించి మిగిలిన డబ్బును స్కూటీలో ఉంచి నిలిపి ఉండగా ఈ చోరీ జరిగిందని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

3 టీఎంసీలు దాటిన గండికోట నీటిమట్టం



గండికోట ప్రాజెక్టు వద్ద నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 13: గండికోటలో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. 11 న అవుకు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయగా ఇప్పటి వరకు 1.5 టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరింది. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 11,600 క్యూసెక్కులు ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో మూడు టీఎంసీల నీటిమట్టం దాటినట్లు డీఈ తెలిపారు.

జిల్లాలో 24మంది సీఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 13: వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 24 మంది సీఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు రైల్వేలో పనిచేస్తున్న నాగార్జునను కడప టూ టౌన్, కడప టూటౌన్‌లో పనిచేస్తున్న ఇబ్రహీంను కర్నూలు సీసీఎస్, కళ్యాణ దుర్గం రూరల్‌లో పనిచేస్తున్న వెంకటనాగరాజును కడప తాలూకా, కడప తాలూకాలో పనిచేస్తున్న రాజాను కడప వీఆర్ ఎస్పీ, ఒంటిమిట్టలో పనిచేస్తున్న పురుషోత్తంరాజును చెన్నూరు, చెన్నూరులో పనిచేస్తున్న పార్థసారథిని కడప వీఆర్ ఎస్పీ, కలకడలో పని చేస్తున్న శ్రీనివాసులును పోరుమామిళ్ల, పులివెందుల రూరల్‌లో పని చేస్తున్న బాలమద్దిలేటిని ప్రొద్దుటూరు రూరల్, ప్రొద్దుటూరు రూరల్‌లో పనిచేస్తున్న రమణారెడ్డిని కడప వీఆర్ ఎస్పీ, కడప రెడ్ శ్యాండల్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న నారాయణయాదవ్‌ను జమ్మలమడుగు, జమ్మలమడుగులో పనిచేస్తున్న కడప వీఆర్ఎస్పీ, అనంతపురం వీఆర్‌లో పనిచేస్తున్న వెంకటరమణను పులివెందులకు, చిత్తూరు వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న లింగప్పను పులివెందుల రూరల్‌కు, కడప ఇంటలిజెన్సులో పనిచేస్తున్న నాగరాజును ఆర్కేవ్యాలీ, కడప డీసీఆర్‌బీలో పని చేస్తున్న సయ్యద్ హసంను మైదుకూరు అర్బన్, మైదుకూరు అర్బన్‌లో పనిచేస్తున్న మస్తాన్‌ను కడప వీఆర్ ఎస్పీ, అన్నమయ్య వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న మోహన్‌ను ఖాజీపేట, కడప వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న రామచంద్రను మదనపల్లె టూటౌన్, కడప వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న యల్లమరాజును రైల్వేకోడూరు, కడప వీఆర్ ఎస్పీలో పనిచేస్తున్న శ్రీనాథరెడ్డిని కర్నూలు డీఎస్బీ-2, కర్నూలు మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హాజీవల్లిని పులివెందుల ట్రాఫిక్, కర్నూలు వీఆర్ఆర్ఓలో పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిని కడప డీసీఆర్బీ, కడప డీసీఆర్బీలో పనిచేస్తున్న రాజాప్రభాకర్‌ను కడప వీఆర్ఎస్పీ, ఏపీ జన్‌కోలో పనిచేస్తున్న జావేద్‌ను కడప ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.



తైక్వాండోలో సత్తా చాటిన వి. తైక్వాండో క్లబ్ క్రీడాకారులు

తైక్వాండోలో సత్తా చాటిన జిల్లా వాసులు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 13: తిరుపతిలో ఈనెల 11, 12, తేదీల్లో జరిగిన మొదటి సౌత్‌జోన్ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లావాసులు సత్తా చాటారు. సుమయ్య, చంద్రకళ, సుహాన్విక రెడ్డి, ఎన్. చరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్. ప్రణయ్‌కుమార్‌రెడ్డి, టి. హర్షవర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్, గోల్డ్‌మెడల్ సాధించగా భవ్య, జాహ్నవి, సాయి, ఎం. సాయిచాణక్యరెడ్డి, ఈకౌశిక్ నారాయణ, సోహైల్, సాజిద్, సిల్వర్‌మెడల్స్ సాధించినట్లు వి తైక్వాండో మాస్టర్ ఎస్‌కె వసీం, కోచ్ కె.నరసింహ వెల్లడించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కడప(రూరల్) ఆగస్టు 13: జడ్పీ సీఈఓ ఎం. సుధాకర్‌రెడ్డి అనుమతి మేరకు జడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామక ఉద్యోగాల దరఖాస్తు దారుల సర్టిఫికెట్లను కమిటీ బృందం పరిశీలించారు. మొత్తం 9 మంది హాజరు కావాల్సి ఉండగా 7 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మన్నూరు సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, పరిపాలనా అధికారి రంగాచార్యులు, సీనియర్ స్టెనో తదితరులున్నారు.

చైను అపహరణ

రైల్వేకోడూరు, ఆగస్టు 13: రెడ్డివారిపల్లె పంచాయితీ పరిధి కేసీ అగ్రహారం వాసి కంచర్ల రాజమ్మ బంగారు చైను గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం అపహరించాడు. బాధితురాలి వివరాల మేరకు... ఆస్పత్రి కోసం తిరుపతికి వెళ్లిన రాజమ్మ తిరిగి రైల్వేకోడూరు నుంచి స్వగ్రామనికి ఆటోలో రెడ్డివారిపల్లె వరకు వెళ్లింది. అక్కడి నుంచి కేసీ అగ్రహారా నికి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మోటారు సైకిల్‌లో వేగంగా వచ్చి మెడలో ఉన్న బంగారు చైను అపహరించాడు. బంగారు చైను 40 గ్రాములు ఉంటుందని దీని విలువ రూ. 2.4 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

పుష్పగిరి గుట్టపై లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళిక

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 13: పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి గుట్టపై లక్ష మొక్కలు నాటే దిశగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు సామాజిక అటవీశాఖ డీఎఫ్ఓ ఎం.నాగార్జున రెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసరు నాగేశ్వర్‌రెడ్డి, అటవీశాఖ రిటైర్డ్ డిప్యూటీ కన్జర్వేటర్ శ్రీనివాస్ ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, సభ్యుడు భారవి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య గుట్టపై మొక్కలు నాటేందుకు అనువైన స్థలం పరిశీలించారు. మొక్కలు నాటడం, నీటి లభ్యత అంశాలపై చర్చించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇన్‌టాక్, లయన్స్ క్లబ్ కలవడం అభినందనీయమన్నారు.

'కమీషన్ అడిగితే డీటీ బెదిరిస్తున్నాడు'

జమ్మలమడుగు, ఆగస్టు 13: కమీషన్ అడిగితే తనను డీటీ వరదకిశోర్‌రెడ్డి బెదిరిస్తున్నాడని తహసీల్దారు కార్యాలయంలో దొరసానివీధి 4వ రేషన్ షాప్ డీలర్ ఓ.హబీబూన్ భర్త తానేషావలి తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. తహసీల్దారుకు సమస్యను తెలిపాడు. తన భార్య ఓ.హబీబూన్‌పేరుపై డీలర్ షాపు ఉండేదన్నారు. కొన్నేళ్లగా రేషన్ షాపు సమస్య రాకుండా పంపిణీ చేశానని తెలిపాడు. గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరదకిశోర్‌రెడ్డి తనకు ఫోన్ చేసి డీలర్‌షిప్ రాజీనామా చేయాలని కోరారన్నారు. అడిగిన వెంటనే తాను డీలర్‌షాప్‌కు రాజీనామా చేసి తనకు రావాల్సిన కమీషన్ డబ్బు రూ.21,300 అడుగగా కొత్త డీలర్ నుంచి ఇప్పిస్తానని, మా ఇంట్లో బియ్యం కాటా మిషన్, ఈపాస్ మిషన్‌లు ఇచ్చారన్నారు. డీలర్ రాజీనామా పత్రాన్ని ఇంతవరకు ఆమోదించకుండా మళ్లీ తన భార్యను సంతకం చేయమని డీటీ అడిగారన్నారు. కమీషన్ అడిగితే నోరు పారేసుకుని ఇష్టానుసారంగా దుర్భాషలాడారని వాపోయాడు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రతిఒక్కరూ క్రియాశీలకంగా పనిచేయాలి

● ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడిగా తిరుపాల్‌నాయక్



మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు

సుండుపల్లె, ఆగస్టు 13: ప్రతిఒక్కరూ క్రియాశీలకంగా పనిచేసి ఏపీయూడబ్ల్యూజే సంఘానికి మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడిగా తిరుపాల్‌నాయక్ (ఆంధ్రజ్యోతి), ప్రధాన కార్యదర్శిగా నారాయణ రాజు, గౌరవాధ్యక్షుడిగా రెడ్డిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సలీం, యూసఫ్‌లు ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు. విలువలతో కూడిన వార్తలు రాసి ప్రజాధరణ పొందాలని కోరారు. ప్రజా సమస్యలపై శ్రద్ధ చూపి వార్తలు రాస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లె శ్రీనివాసులు, మాజీ మండల అధ్యక్షుడు విశ్వనాధ్‌నాయక్, శ్రీనాధ్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనాధ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జిల్లా కోశాధికారి పల్లం చందు, గౌరవాధ్యక్షుడు పల్లం తాతయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ దర్బార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన ప్రసాద్‌బాబు



లోకేశ్‌బాబుతో సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 13: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును మంగళవారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ నేత సుగవాసి ప్రసాద్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రసాద్‌బాబు గుంటూరులోని టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును, ఎమ్మెల్సీ బీటీ జనార్థన్‌ను, టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవీచంద్రయాదవ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ఒంటిమిట్ట, ఆగస్టు 13: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో రెడ్డయ్య అన్నారు. మూడు రోజుల పాటు పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. గ్రామాల్లో రీసైక్లింగ్ ద్వారా సంపద సృష్టించాలని, వీరితో పాటు వీధిలైట్లు, ఎల్ఈడీ బల్బుల వినియోగం, పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో పశువులకు అవసరమయ్యే ఏర్పాట్లు చేపట్టాలని అందుకోసం ప్రజలను చైతన్యం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీలో పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ ఉమా, ఈవోపీఆర్డీ రంగయ్య, పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవరెడ్డి, సుధాకర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



పూలికుంటలో మాట్లాడుతున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఆగస్టు 13: టీడీపీ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16 నుంచి ప్రారంభిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పూలికుంట గ్రామం రెడ్డివారిపల్లెలో మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ కొండారెడ్డి మనమరాలి వివాహ రిసెప్షన్ విందుకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రైతుల భూములను అన్యాక్రాంతం చేసి భూదందాలతో రైతులను నట్టేట ముంచారన్నారు. రైతుల భూ సమస్య పరిష్కారం కోసమే ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారధిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, టోపీవలి, హరినాథరెడ్డి, యువగళం సభ్యులు వెంకట్రామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి

నందలూరు, ఆగస్టు 13: రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు మండలంలో ఏదోక పరిశ్రమ ఏర్పాటు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయం మంగళగిరిలో పరిశ్రమశాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలో గతంలో ఆల్విన్‌ఫ్యాక్టరీ ఉండేదని, అది మూతపడిందని, మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఆలయానికి రూ.75 వేలు వితరణ

చిట్వేలి, ఆగస్టు 13 మండల పరిధిలోని కంబారాయుడుస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రహ్మంగారి ఆలయానికి గాంధీనగర్ నివాసి కీ.శే దేరంగుల పెద్దరామయ్య జ్ఞాపకార్థం భార్య చిన్నక్క, కుమారుడు శేఖర్‌లు మంగళవారం రూ.75 వేల విరాళాన్ని ఆలయ నిర్మాణ ధర్మకర్త రామ్మోహన్‌కు అందజేశారు. దాతల కుటుంబ సభ్యులు కోడలు అనిత, మనవళ్లు యశ్వంత్, తేజేష్, కవితలు గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, ఆగస్టు 13: రాయచోటి పట్టణంలో ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రతి ఒక్కరూ తమ ఇంటి మీద జెండా ఎగురవేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

హర్‌ఘర్ తిరంగా ద్వారా ప్రతి ఒక్కరిలో దేశభక్తి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



హర్‌ఘర్ తిరంగా వద్ద మంత్రి, కలెక్టర్ తదితరులు

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా ద్వారా ప్రతిఒక్కరిలో దేశభక్తి పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తిరంగా బ్యానర్‌పై మంత్రి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జాతీయ సమగ్రతను, సమైక్యతను, కాపాడడం మనందరి బాధ్యత అని, ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై దేశసమగ్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ ఇన్‌చార్జ్ సాయిలోకేశ్ తదితర రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం 100 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం నుంచి పాత పోలీసు లైను, ఆర్ఎస్ రోడ్డు, పాతబస్టాండు, మెయిన్‌రోడ్డు, శివాలయం, అమ్మవారిశాల మీదుగా బంగ్రాళ్లవీధి గుండా తిరిగి గాంధీ విగ్రహం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలనే ఉద్ధేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుణవర్మ, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇ.పాపయ్య, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సూర్యచంద్ర, మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: పట్టణంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దార్ మహబూబ్ చాంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని కొత్తబస్టాండు నుంచి మార్కెట్‌మీదుగా పాతబస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రఘునాధ్‌రాజు, ఆర్ఐ రాజేష్, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, డీటీ లవన్‌కుమార్, వీఆర్వోలు, వీఆర్ఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): మండలంలోని బుడుగంటపల్లె గ్రామంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి బుడుగుంటపల్లె గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతి ఇంటికి జాతీయ జెండా అందజేసి జెండా ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురం: కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో వెంకటేశ్వర, గౌతమ్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులతో జాతీయ జెండాను మూడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఎంఈవో రామకృష్ణుడు, ఈవోపీఆర్డీ ఉషారాణి, ఆర్ఐ రవికుమార్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఈ నెల 15వ తేదిన హరఘర్ తరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ చక్రేనాయక్ పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులచే స్థానిక మూడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, ఏఓ గురుప్రసాదు, బ్లాక్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామరాజు, ఏపీఎం నిరంజన్, వ్యవసాయ అధికారి రమేష్‌బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, ఆగస్టు 13: మండలంలోని మైసూరివారిపల్లెను రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మైసూరివారిపల్లెలో గ్రామ సభను సర్పంచ్ కారుమంచి సంయుక్త అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసూరివారిపల్లె పంచాయతీ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 21న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలో నిర్వహించే రెవెన్యూ గ్రామ సభకు హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ సంయుక్త మాట్లాడుతూ మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలో నాలుగు గ్రామాలు ఉన్నాయని, ప్రధానంగా తమ పంచాయతీలో ఆస్పత్రి లేదని, అండర్ డ్రైనేజి సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలు విన్నవించారు. అనంతరం రైల్వేకోడూరు జడ్పీటీసీ సభ్యురాలు పాశెంకోట రత్నమ్మ, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, జనసేన నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, మణి, టీడీపీ సీనియర్ నాయకులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి పాటుపడాలి

● జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, ఆగస్టు 13: ప్రతిఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శైలజ కోరారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, పీసీఎస్ఎస్, ఎల్‌డబ్ల్యుఎస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీకు తెలుసా' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీఎల్ ఏటీవో స్వాతి, పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్, ఎల్‌డబ్ల్యుఎస్ అల్లావల్లి, ప్రిన్సిపాల్ చెన్నకేశవరెడ్డి, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

చిట్వేలి, ఆగస్టు 13: మన బాధ్యతలను మనం సక్రమంగా నిర్వర్తించడమే నిజమైన దేశభక్తి అని ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త విధి నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి, టైపిస్టు, హరీష్, చిట్వేలి, పెనగలూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

భూ రికార్డులు జాగ్రత్త

రైల్వేకోడూరు, ఆగస్టు 13: రెవెన్యూపరంగా ఉన్న రికార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా సర్వే భూమి రికార్డుల అధికారి టి.జయరాజ్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల విషయంలో తప్పులు చేయకుండా ఉండాలని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రం

పెనగలూరు, ఆగస్టు 13: మండల వ్యాప్తంగా గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల పరిసరాలను కోఆప్షన్ సభ్యులు డాక్టర్ టి.రామక్రిష్ణయ్య, టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి మారం రెడ్డిశివయ్య అధ్యక్షతన మంగళవారం పరిశుభ్రత కార్యక్రమాన్ని పాటించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల చుట్టుపక్కల ఆవరణంలోని పిచ్చిమొక్కలను, కంపచెట్లను ఎక్సకవేటర్ సహాయంతో శుభ్రం చేయించారు. డాక్టర్ రామక్రిష్ణయ్య, శివయ్యలను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కోరం లేక సమావేశం వాయిదా

సిద్దవటం, ఆగస్టు 13: మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు అధ్యక్షతన మంగళవారం జరగాల్సి ఉండగా, కోరం లేక వాయిదా పడింది. మండల పరిధిలో ఉన్న ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి రాకపోవడంతో అధికారులు ఈ సమావేశాన్ని వాయిదా వేశారు. మండల అధ్యక్షురాలు ఎంపీడీవో జవహర్‌బాబు, డిప్యూటీ తహశిల్దారు మాధవీలత, మండల విస్తరణ అధికారి పులిరాంసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ బాబు, ఏపీవో నరసింహులు, ఏపీఎం వెంకటేశ్వర్లు, వెటర్నరీ వైద్యాధికారి శివశంకర్, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

డ్రిప్ స్ప్రింకర్లపై రైతులకు అవగాహన

సిద్దవటం, ఆగస్టు 13: పెద్దపల్లి రైతుసేవా కేంద్ర పరిధిలోని పేరయ్యగారిపల్లె, శివునిపల్లె గ్రామాల్లో డ్రిప్ స్ప్రింకర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు డ్రిప్ రిజిస్ట్రేషన్ చేయించడమేగాకుండా వాటికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. ప్రతిఒక్క అర్హత ఉన్న రైతు డ్రిప్ లేదా స్ప్రింకర్లను దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ జిల్లా అనుసంధానం అధికారి ప్రగతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం ప్రతినిధి ప్రేమ్‌సందీప్, డ్రిప్ కంపెనీవారు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులచే హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

పెనగలూరు, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే యాజమాన్యాలు జాతీయ జెండాను చేతబూని స్థానిక పురవీధుల్లో తిరంగా ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

పిల్లల కడుపులు కొడతారా ?

● ఏపీ దళితవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 13: పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటే బాగా చదువుకుంటారని, ఉడికి ఉడకని అన్నం పెట్టి పిల్లల కడుపులు కొడతారా అని ఏపీ దళితవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లె ఓబులేసు పేర్కొన్నారు. రెండు రోజులుగా లక్కిరెడ్డిపల్లె అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఉడకని అన్నం పిల్లలకు పెడుతున్నారని ఓ విద్యార్థి తండ్రి సోషియల్ మిడియాలో పెట్టిన పోస్టు వైరల్ అయింది. ఈ సందర్భంగా మంగళవారం ఓబులేసు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల దళితవేదిక అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి, వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రీ ల్యాండ్ భూములపై ఆర్డీవో సమీక్ష



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రంగస్వామి

సంబేపల్లె, ఆగస్టు 13: ఫ్రీ ల్యాండ్ భూములపై ఆర్డీవో రంగస్వామి మంగళవారం సంబేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2003 ముందు అసైన్మెంట్ కమిటీలో రైతులకు డీఫారాలు ఇచ్చిన భూములను గుర్తించాలన్నారు. ప్రస్తుతం భూమిని ఎవరు దున్నుతున్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఎవరి పేరు మీద ఉన్నది, ఆన్‌లైన్‌లో ఎవరు ఉన్నారు తదితర అంశాలను గుర్తించాలన్నారు. నివేదికలను సిద్ధం చేసి త్వరగా తమకు అందజేయాలని సూచించారు. నిష్పక్షపాతంగా ఫ్రీల్యాండ్ భూములను గుర్తించాలని సూచించారు. అర్హులైన రైతుల భూములు రిజిస్టర్ అవుతాయన్నారు. డీకేటీ భూములు కొనినా, అమ్మినా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ స్రవంతి, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

పురంధేశ్వరిని కలిసిన మహిళా నేత



రాజంపేట, ఆగస్టు 13: విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మధుకర్‌లను మహిళా మోర్చ అధ్యక్షురాలు, లఘు ఉద్యోగ్ భారతి స్టేట్ డైరెక్టర్ సునీతనారాయణవర్మ మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మహిళ మోర్చ ఎదుర్కొంటున్న వివిధ స్థానిక సమస్యలు, మహిళా సాధికారత కోసం చేయాల్సిన కార్యక్రమాల గురించి వారికి వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన మేడా విజయశేఖర్‌రెడ్డి



కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నేతలు

నందలూరు, ఆగస్టు 13: రాయచోటిలోని కలెక్టరేట్‌లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ శ్రీధర్‌ను కలిశారు. ఈ మేరకు రాజంపేట నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలన్నింటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి తొందరలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ మండలాధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, టి.సుండుపల్లె మండల మైనార్టీ నాయకుడు రాయవరం రఫీక్, లేబాక గ్రామ సర్పంచ్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులను ప్రోత్సహించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి చంద్రానాయక్

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 13: ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని ప్రతి రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీలో రైతు పగడాల నాగమణి పొలాన్ని పరిశీలించారు. సజ్జ పంటను ఈ-పంట యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. అనంతరం పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబరేటరీని పరిశీలించి రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.కవిత, హార్టికల్చర్ అధికారి ఎం.వెంకటభాస్కర్, మండల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ లక్ష్యం

● టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్



ప్రజా సమస్యలను టీడీపీ కేంద్ర కార్యాలయంలో పరిశీలిస్తున్న పంతగాని

రైల్వేకోడూరు, ఆగస్టు 13: ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ లక్ష్యం అని టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు వివరించారు.

దేశ విభజనపై ఛాయా చిత్ర ప్రదర్శన

● జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

రాయచోటిటౌన్, ఆగస్టు 13: పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం విభజన సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి దేశ విభజన సంస్మరణ దినోత్సవానికి సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రముఖ వైద్యుడు కే.బయారెడ్డి ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఆగస్టు 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనను పట్టణ ప్రజలందరూ తిలకించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జగదీశ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

● కడప జిల్లా పశు గణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహక అధికారి

రామాపురం, ఆగస్టు 13: సూటి పశువుల గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కడప జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణ అధికారి జీ.రమేశ్ అన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామం చెనిక్కాయలపల్లెలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 రకాల పశువులకు గర్భకోశ వ్యాధులు, 10 సూటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సహాయ సంచాలకుడు సుధీర్‌నాథ్, బెనర్జీ, పశువైద్యాధికారి శివరామిరెడ్డి, రామాపురం మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యపూజకోన రహదారి ఏర్పాటుకు సర్వే



సర్వే చేపడుతున్న అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు

సిద్దవటం, ఆగస్టు 13: మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీలోని నిత్య పూజకోన రహదారి ఏర్పాటుకు సర్వే చేస్తున్నారు. స్వామి వారి దర్శనానికి వెళ్లే భక్తులకు అనువుగా ఉండేందుకు అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు రహదారి పనులు చేపట్టేందుకు మంగళవారం ఫారెస్ట్ ఏరియాలో రెవెన్యూశాఖ, అటవీశాఖ అధికారులు ఉమ్మడిగా సర్వే నిర్వహించారు. ఫారెస్ట్ బౌండరీలు పరిశీలించారు. ఈ రహదారి పనులు పూర్తయితే నిత్యపూజ కోనకు వెళ్లే ద్విచక్ర వాహనదారులకు, ఆటోలకు, నడిచివెళ్లే భక్తులకు ఎంతో అనువుగా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో సిద్దవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, సర్వేయర్ పురుషోత్తం, అటవీ శాఖ సిబ్బంది, ఎండోమెంట్ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన



గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ

పెనగలూరు, ఆగస్టు 13: మండలంలోని పారిశుధ్య కార్మికులకు ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ సుబ్బరాయుడు అధ్యక్షతన మంగళవారం తడిపొడి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ సభా భవనంలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి గ్రీన్ అంబాసిడర్లు సేకరించే చెత్త సేకరణ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం సింగారెడ్డిపల్లె, పెనగలూరులకు సంయుక్తంగా అప్పనపల్లె వద్ద నిర్మించిన చెత్త సేకరణ కేంద్రంలో చెత్త సేకరణ విధానంపై తొట్లల్లో వేయాల్సిన పనుల గురించి వివరించారు.

పొలంబడి కార్యక్రమాన్ని సందర్శించిన జేడీ

ఓబులవారిపల్లె, ఆగస్టు 13: మండలంలోని గోవిందంపల్లె గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న జీఏపీ పొలంబడి కార్యక్రమాన్ని అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ సందర్శించారు. మండల వ్యవసాయశాఖ అధికారిని మల్లిక ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగు రైతులతో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులు పంటమార్పిడి కొరకు చిరుధాన్యాల సాగు ఎంతో మేలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని మల్లిక, వీఏఏలు, వీహెచ్‌వోలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జెండా ఎగురవేయాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతి సమైక్యతను చాటుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆకాంక్షించారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వెయ్యి అడుగుల జెండాతో చిత్తూరులో ర్యాలీ నిర్వహించారు. తెలుగుతల్లి, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో 'కేశవరెడ్డి' విద్యార్థులు అలరించారు. అక్కడి నుంచి జన జాగృతి సమితి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ సంతపేట లిల్లీ బ్రిడ్జ్ వరకు సాగింది. సంతపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ దేశ సమగ్రత, జాతీయతను కాపాడేలా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల మనోభావాలను అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుని వారి అడుగు జాడల్లో నడవాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి అఖిల్, బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర , నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్, ధనుష్కోటి, జ్యోతిష్, పునీత్, విద్యార్థులు పాల్గొన్నారు.




స్వాతంత్ర సమరయోధులు, భారతమాత వేషధారణలో విద్యార్థులు - సంతపేట హైస్కూల్ నుంచి ర్యాలీ..

● పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన 'భవిష్యత్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర' అంశంపై వ్యాసరచ, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉద్యమంలో తెలుగువారైన పింగళి వెంకయ్య పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతపై అవగాహన పెంచుకోండి

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: దేశ సమగ్రత, సమైక్యత, జాతీయవాదంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భాగంగా మంగళవారం విద్యార్థులు, క్రీడాకారుల ర్యాలీని చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు. ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా పీసీఆర్ జూనియర్ కళాశాల వరకు సాగిన ర్యాలీలో కొందరు చిన్నారులు జాతీయ జెండాను చేతపట్టి స్కేటింగ్ చేస్తూ పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని కలెక్టర్ కోరారు. బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో జాతీయతను ఉద్దేశించి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 15న మంత్రి సత్యకుమార్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారన్నారు. ర్యాలీలో క్రీడాధికారి బాలాజీ, జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి ప్రదీప్, పీడీ బాబు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నియామకం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిని ఆయా జిల్లాలకు నియమిస్తూ హైకోర్టు విజిలెన్సు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తిలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.ధర్మారావును అనకాపల్లి మొదటి తరగతి జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు. కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిలో తిరుపతికి చెందిన పల్లెపాగు ప్రశాంత్‌ను మాచర్ల అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరుకు చెందిన ఎం.రోహిత్‌ను విశాఖ జిల్లా నర్శీపట్నం అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరులో స్పెషల్ మొబైల్ కోర్టు, ఐదో అదనపు సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కీర్తనను మదనపల్లె రెండో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు.

తిరుమలలో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి

తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని భాస్కర్‌భవన్ విశ్రాంతి భవనానికి చేరుకున్న వీరికి స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. వీరు బుధవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.



అతిథిగృహంలోకి వెళుతున్న వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి

108లో సుఖప్రసవం



పూతలపట్టు, ఆగస్టు 13: 108 వాహనంలో ఓ గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. పాకాలకు చెందిన ఆయేషా పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు ఆమె ను మంగళవారం సాయంత్రం పి. కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఆమె ప్రసవించింది.

ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేయండి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: రెవెన్యూశాఖతో వ్యవసాయశాఖ సమన్వయం చేసుకుని ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమీక్షాసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం పరికరాల పంపిణీకి సంబంధించి ఈ ఏడాది 21వేల హెక్టార్ల లక్ష్యంలో వంద రోజులో 3500 హెక్టార్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. 20శాతం కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయని అధికారులు ఇకనైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖలకు సంబంధించిన జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యానవన శాఖ జేడీ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు ఏర్పాట్లు పూర్తిచేయండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దిన వేడుకలకు 24 గంటల్లోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ప్రశాంత్‌నగర్‌లోని పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మణికంఠతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పతాకావిష్కరణకు వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరవుతారని చెప్పారు. పరేడ్ మైదానంలో డయాస్, స్టేజ్ డెకరేషన్, ప్రొటోకాల్ మేరకు పకడ్బందీగా చేయాలని ఆర్డీవో శివయ్యను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ అరుణకు సూచించారు. శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా, డ్వామా పీడీ రాజశేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరేడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

'గల్లా' ఇంట్లో గ్రంథాలయం



సాకం నాగరాజును సన్మానిస్తున్న గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి

తవణంపల్లె, ఆగస్టు 13: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి సొంతూరు తవణంపల్లె మండలం దిగువమాఘంలోని తమ ఇంట్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజ, డాక్టర్ గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారితో కలిసి దీనిని ప్రారంభించారు. పుస్తకం ఇచ్చే స్ఫూర్తిని టీచర్ కూడా ఇవ్వలేడని, పుస్తకం గురువును మించిందని ఈ సందర్భంగా గల్లా అరుణ అన్నారు. పుస్తకాలు మన ఐశ్వర్యమని, ఇంటింటా పుస్తకాల ర్యాక్ ఉండాలని సాకం నాగరాజ అన్నారు. కార్యక్రమంలో రచయితలు నామిని సుబ్రమణ్యం నాయుడు, అరుణకుమారి, మౌని, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. రాజాచంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సహదేవ నాయుడు, అరసం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్, పత్తిపాటి రమేష్‌నాయుడు, ధర్మయ్య, బాలకృష్ణారెడ్డి, ముని హాజరయ్యారు.

సచివాలయానికి తాళం

పరిహారం కోసం రైతు కుటుంబం చర్య ● సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

వి.కోట, ఆగస్టు 13: వి.కోట మండలం జవ్వునిపల్లె సచివాలయానికి మంగళవారం ఉదయం ఓ రైతు కుటుంబం తాళం వేసింది. ప్రభుత్వ అవసరాలకు ఇచ్చిన భూములకు పరిహారం చెల్లించాలంటూ సోమశేఖర్ కుమారుడు అజయ్‌కుమార్ తాళం వేశారు. సచివాలయాల నిర్మాణ సమయంలో జవ్వునిపల్లెకు వెళ్ళే దారిలో ఉన్న సోమశేఖర్‌కు చెందిన సర్వే నంబరు 572 లోని డీకేటీ పొలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్నారు. అందుకు ప్రతిఫలంగా అప్పటి వైసీపీ పెద్దలు వాళ్ల ఇంట్లో ఒకరికి ఉద్యోగం, జగనన్న కాలనీలో రెండు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వారి గ్రామంలో కాకుండా మావత్తూరు కాలనీలో ఇంటిస్థలం ఇచ్చేందుకు ప్రయత్నించడంతో వారు అంగీకరించలేదు. ఆపై వి.కోట పట్టణంలో ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. ఏళ్ళు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన సోమశేఖర్, అతడి కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం సచివాలయం వద్దకు చేరుకుని సిబ్బందిని బయటకు పంపి తాళం వేశారు. సమాచారం అందుకున్న డీటీ బాలాజీ, ఆర్ఐ మోహన్‌రెడ్డి సచివాలయం వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. తాళం వేయడం సబబు కాదని ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారి చేతే తాళాలను తీయించారు. భూమికి సంబంధించి పరిహారం రాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. సమ్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



జవ్వునిపల్లె సచివాలయానికి తాళం వేసిన భూయజమానులు

కాణిపాక ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 13: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కె.వాణి మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆమె వరసిద్ధుడి ఆలయంలో డిప్యూటీ ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత ఈవో వెంకటేశు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన్ను తన మాతృ సంస్థకు బదిలీ చేసిన విషయం విధితమే. ఆలయ పాలన కోసం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వాణికి బాధ్యతలు అప్పగించారు. త్వరలో రెగ్యులర్ ఈవోను నియమించనున్నారు. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వాణిని ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వాణి

టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై కసరత్తు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో త్వరలో చేపట్టే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై విద్యాశాఖ అధికారులు మంగళవారం కసరత్తు చేపట్టారు. నగరి డివిజన్ పరిధిలో డీఈవో దేవరాజు, చిత్తూరు, కుప్పం డివిజన్ పరిధిలో డీవైఈవో చంద్రశేఖర్, పలమనేరు డివిజన్ పరిధిలో ఏడీ వెంకటేశ్వరరావులు ప్రక్రియలో పాల్గొన్నారు. సీనియారిటీ జాబితా ఆధారంగా జూనియర్లను మిగులుగా గుర్తించారు. త్వరలో ఉద్యోగ విరమణ చెసేవారిని, వితంతు, 70 శాతం వైకల్యం, ఒంటరి మహిళ, విడాకులు తీసుకున్నటువంటి విభాగాలను ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.

గంజాయి కేసులో భార్యాభర్తల అరెస్టు



అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి

పలమనేరు, ఆగస్టు 13: పలమనేరు ప్రాంతం లో గంజాయి విక్రయించేందుకు అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నుంచి వచ్చిన భార్యాభర్తలు శంకర(36), ఆదెమ్మ(26)ను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 9.340 కిలోల గంజాయిని విక్రయించేందుకు గంగవరం సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద వేచి ఉన్నట్లు సమాచారం వచ్చింబది. అక్కడికి సిబ్బందితో వెళ్లి శంకర, ఆదెమ్మను అరెస్టు చేసి రూ.లక్ష విలువ చేసే 9.340 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు.ఈ దాడుల్లో తనతో పాటు ఎస్ఐ దత్తాత్రేయ, హెడ్ కానిస్టేబుళ్ల వెంకటేసు, దేవరాజులు,క్రిష్ణమాచారి,విజయకుమార్,కానిస్టేబుళ్ల పాల్గొన్నారన్నారు.

మొగిలీశ్వర్ హత్యకేసులో నిందితురాలి అరెస్టు

పలమనేరు, ఆగస్టు 13: పలమనేరులో సంచలనం సృష్టించిన మొగిలీశ్వర్(55) హత్యకేసులో నిందితురాలు దేవరశెట్టి మంగమ్మ(49)ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్టు సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం... పలమనేరు కాకాతోపులో నివాసం ఉంటున్న మొగిలీశ్వర్, గంగవరం మండలం యామనపల్లికి చెందిన మంగమ్మతో సహజీవనం సాగిస్తున్నారు. పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలో నాలుగేళ్లుగా వీరిద్దరూ ఉంటున్నారు. తన భార్య భారతి, పిల్లలను పట్టించుకోకుండా సంపాదనంతా మంగమ్మకే మొగిలీశ్వర్ ఖర్చుపెట్టేవాడు. మద్యానికి బానిసైన ఇతడు తరచూ అనుమానంతో మంగమ్మను కొట్టి వేధించేవాడు. ఇరుగుపొరుగు వారు మంగమ్మను మందలించేవారు. దీంతో మొగిలీశ్వరయ్యను అంతం చేస్తేకానీ తనకు ఈ బాధలు ఉండవని భావించిన మంగమ్మ.. ఈనెల 11వతేది రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంట్లోకి వచ్చిన మొగిలీశ్వరయ్యను చాకుతో పొడిచింది. తీవ్ర రక్తస్రావంతో అతడు చనిపోయాడు. విషయం తెలుసుకొన్న మొగిలీశ్వరయ్య భార్య భారతి తన భర్తను మంగమ్మ చాకుతో పొడిచి చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలైన మంగమ్మను అరెస్టుచేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించిందన్నారు. దీంతో ఆమెను మదనపల్లె సబ్‌జైలుకు పంపినట్లు చెప్పారు.



నిందితురాలి అరెస్టు చూపుతున్న సీఐ చంద్రశేఖర్

అమెరికా అబ్బాయి...తెలుగమ్మాయి

చిత్తూరు రూరల్, ఆగస్టు 13: ప్రేమకు కులం, మతం, భాష, దేశం అడుకాదని నిరుపించింది ఈ జంట. చిత్తూరు నగరానికి చెందిన దయాసాగర్‌రెడ్డి, లావణ్యల కుమార్తె మంజుశ్రీ. ఈమె 2018లో ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లింది. అక్కడే మైఖేల్ జాక్‌మెన్ అనే అబ్బాయితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమకు దారితీసింది. మతం,దేశం వేరయినా ఇరువురు కలిసి తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించారు. అబ్బాయి కుటుంబ సభ్యులను చిత్తూరుకు రప్పించి మంగళవారం రిసెప్షన్ నిర్వహించారు. .వీరికి బుధవారం పెళ్లి జరగనుంది.



ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 13: బైరెడిడపల్లె మండలం గొల్లచీమనపల్లె గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ నవీన్‌కుమార్‌కు మంగళవారం కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటివీడ్కోలు పలికారు. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. గుండెపోటుతో ఈయన మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం ఆర్మీఅధికారులు నవీన్‌కుమార్ మృతదేహాన్ని గొల్లచీమనపల్లెకు తీసుకొచ్చి కుటుంబీకులకు అప్పగించారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవరాజు, వివిధశాఖల సిబ్బంది, గ్రామస్తులు నవీన్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబీకులను పరామర్శించారు.



నెల్లూరు కల నెరవేరింది

షార్ సందర్శనపై పవన్ కల్యాణ్

సూళ్లూరుపేట, ఆగస్టు 13 : నెల్లూరులో చదువుకునే రోజుల్లో శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు చేపడతారని తెలిసి అక్కడికి వెళ్లాలనుకున్నా.అయితే శాస్త్రవేత్తలుంటారు కాబట్టి భారీ భద్రతా ఏర్పాట్లుంటాయి కాబట్టి వెళ్లలేమలే అనుకునే వాడిని.అయితే ఈ రోజు యాధృచ్ఛికంగా అంతరిక్ష దినోత్సవానికి హాజరై షార్ సందర్శించడమనే కల నెరవేరింది.... అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు.ఎవరైనా మంచిని బలంగా కోరుకుంటే అది తప్పకుండా నెరవేరుతుందనేది తన విషయంలో నిజమైందన్నారు. షార్‌లో మంగళవారం జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని కురుప్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి అంతరిక్ష దినోత్సవాలను ప్రారంభించారు.అనంతరం షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు 40 వేల ఎకరాల చిట్టడవిలో ఉన్న శ్రీహరికోట నేడు దేశానికే తలామానికంగా మారిందంటే అది శాస్త్రవేత్తల ఘనతేనని తెలిపారు.అంతరిక్షంలోకి మనిషిని పంపడం మన ముందున్న సవాల్ అని అది కూడా శ్రీహరికోట నుంచి పంపించేందుకు సన్నాహాలు చేయడం శుభపరిణామమన్నారు. ఇస్రో పరిశోధనలకు, కార్యక్రమాలకు ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. ఏపీ యువతలో అపరిమితమైన జిజ్ఞాస వుందని, దాన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్ళే దారి లేక యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తోందన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరముందన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల ఫలాలు సామాన్యులకు సైతం అందినప్పుడే నిజమైన విజయమన్నారు. అందులో భాగంగానే అంతరిక్ష పరిశోధనల గురించి గ్రామీణ యువతకు సైతం తెలియజేసేందుకు ఇస్రో ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల కలను చంద్రయాన్-3 విజయంతో నెరవేర్చుకొన్నామని, ఇది దేశానికి కానుకగా ఇస్రో ఇచ్చిన భారీ విజయమన్నారు. 2023వ సంవత్సరం ఆగస్టు 23న చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన రోజును భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా సంబరాలు చేసి మారుమూల గ్రామాలకు సైతం అంతరిక్ష పరిశోధనలు తీసుకెళ్లడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల భావి తరాలకు ఎంతో ఉపయోగమన్నారు.అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.పవన్‌కు అధికారులు చంద్రయాన్ 3 రాకెట్ నమూనాను బహుకరించారు.అంతకు ముందు పవన్ కల్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్,ఎస్పీ సుబ్బరాయుడు, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ స్వాగతం పలికారు.కురుప్ ఆడిటోరియంలో ఆయనకు షార్ డైరెక్టర్ చంద్రయాన్-3 రాకెట్ నమూనాను, ఉపగ్రహాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి,అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురామ్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తలు కానుకగా ఇచ్చిన చంద్రయాన్-3 శాటిలైట్ నమూనాను అబ్బురంగా చూస్తున్న పవన్‌కల్యాణ్

షార్‌లో వివిధ విభాగాల సందర్శన

షార్‌లో వివిధ విభాగాలను పవన్ కల్యాణ్ సందర్శించారు. లాంచ్‌ప్యాడ్, రాకెట్ అనుసంధానం చేసే వీఏబీ భవనంతో పాటు ఎంసీసీ భవనాన్ని ఆయన సందర్శించారు.అంతరిక్ష కేంద్రంలో ఉన్న విభాగాల గురించి పవన్‌కు శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా వివరించారు. షార్‌లోని విభాగాల సందర్శనానంతరం మధ్యాహ్నం 4.30 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని తిరుగుపయనమయ్యారు.

షార్ రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తాం!

తిరుపతి నుంచీ షార్ వెళ్ళే మార్గంలో బుచ్చినాయుడు కండ్రిగ నుంచీ షార్ వరకూ 17 కిలోమీటర్ల మేరకు రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తామని పవన్ కళ్యాణ్ హామీఇచ్చారు. ఈ రోడ్డు బాగాలేదని షార్ అధికారులు తన దృష్టికి తెచ్చారని, వెంటనే తాను కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు మొదలు పెట్టించానన్నారు. మరో ఐదు రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. ఇలాంటి పనులు చేపట్టే బాధ్యత తామే తీసుకుంటామన్నారు.



రాకెట్ ప్రయోగాలు గురించి పవన్‌కు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, ఆగస్టు 13: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు గాలివీడు మండలం, అరవీడు గ్రామం కుమ్మరయ్యగారిపల్లెకు చెందిన బండారు పెద్దన్న కుమారుడు బండారు ప్రభాకర్ (39) మృత దేహాన్ని స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ వెనుక భాగంలో పడి ఉండడాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలంలో మృతదేహంతోపాటు, సెల్ ఫోన్, వాటర్ బాటిల్, పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతనికి 2016లో ప్రవళిక అనే మహిళతో వివాహం కాగా, దక్షిత అనే కూతురు ఉంది. 2017లో భార్య మృతి చెందడంతో 2021లో సుకన్యను వివాహం చేసుకున్నాడు. ఈమెకు దేవాన్ష్ అనే కొడుకు ఉన్నాడు. హోటల్ వ్యాపారంలో నష్టం రావడంతో ప్రభాకర్ కాపురాన్ని బెంగళూరుకు మార్చాడు. అక్కడ బాస్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. గాలివీడు బ్యాంకులో పని ఉందని చెప్పి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి వచ్చినట్లు భార్య సుకన్య తెలిపారు. మృతుడి అన్న రఘు ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ యువరాజు కేసు నమోదు చేశాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 13: కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగి ఓ వివాహిత మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వెంకటేష్ భార్య అశ్వనీ(35) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం గమనించిన స్థానికులు 108లో బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. అక్కడికి తరలించగా చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నట్లు సమాచారం.

PUBLIC NOTICE

Under instructions from my client The Branch Manager, M/S Shriram Finance Ltd, Madanapalle Branch, issue the Trade Loan to Sri. B.Ramana s/o B.Narasimhulu residing at D.No.11-163-1, Ranga Reddy Colony, Kothaindlu H/o, Madanapalle Mandal, Annamayya District. BY keeping of her property more fully described here under are security by way of Regd. Mortgage as such if anybody have any claims, charges, mortgages, sale agreements, Court attachments etc. Shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Chittoor (now Annamayya) District, Madanapalle Sub-District, Madanapalle Mandal, Kothapalle Gram Panchayat, Madanapalle Gramam, Kothaindlu (Bandakadapalle), Ranga Reddy Colony, S.No.301-1A and 309, Plot No.23 144.38 Square yards House D.No.11-163- 1, Assessment No.2641. Bounded on :- East:- House belongs to others, West:- Road, North:- House belongs to others, South:- Road. Within this area measuring East - West both side 38.6 feet or 11.74 meters, North - South both side 33.9 feet or 10.29 meters, in total area 144.38 Square yards site and in constructed house.

G. JANARDHANA REDDY, B.A.B.L., Advocate, Madnapalle. Cell : 9490773727

PUBLIC NOTICE

Under instructions from my client The Branch Manager, M/S Shriram Finance Ltd, Madanapalle Branch, issue the Trade Loan to Sri. R.Nagaraju s/o late R.Narasimhulu residing at D.No.17-304-1, .N.V.R. Street, Madanapalle Town, Annamayya District. BY keeping of her property more fully described here under are security by way of Regd. Mortgage as such if anybody have any claims, charges, mortgages, sale agreements, Court attachments etc. Shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Item 1: Chittoor (now Annamayya) District, Madanapalle Sub-District, Madanapalle Mandal, Madanapalle Municipality, Bandamida Kammapalle Gramam, 3rd Ward, Chowdeswari Nagar interior, S.No.52 paiki, Plot No.2 part 136.58 Square yards sites. Bounded on :- East:- Plot No.2 part site of R.Saraswathi, West:- Plot No.3 of R.Nagaraju, North:- Road, South:- Site belongs to Sesha Reddy and others. Within this area measuring East - West both side 16.5 feet or 5.03 meters, North - West both side 74.5 feet or 22.72 meters in total area 136.58 Square yards site.

Item 2: Chittoor (now Annamayya) District, Madanapalle Sub-District, Madanapalle Mandal, Madanapalle Municipality, Bandamida Kammapalle Gramam, 3rd Ward, Chowdeswari Nagar interior. S.No.52 paiki, Plot No.3, 220 Square yards sites. Bounded on :- East:- Plot No.2 part site of R.Saraswathi, West:- Plot No.4 site, North:- Road, South:- Site belongs to Shesha Reddy and others Within this area measuring East - West both side 30 feet or 9.15 meters, North-South-east side 681/2 feet or 20.87 meters, North South- west side 63 1/2 feet or 19.35 meters in total area 220 Square yards site.

G. JANARDHANA REDDY, B.A.B.L., Advocate, Madnapalle. Cell : 9490773727

లానినోతోనే వర్షాలు?



బాహుదానదిలో పారుతున్న వర్షపునీరు

●సాధారణం కన్నా అధికం ● పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 13: మదనపల్లె డివిజన్‌లో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మదనపల్లె రెవిన్యూ డివిజన్‌లోని అన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా అధికంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండేళ్లుగా ఎండిపోయిన వాగులు, వంకలు కళకళలాడుతున్నాయి.

మదనపల్లె డివిజన్‌లో రెండు రోజులు వర్షం కురుసింది. ఇందులో తొలిరోజున మదనపల్లెలో అత్యధికంగా 60.2 ఎంఎం, కురబలకోటలో 47.2, రామసముద్రంలో 22.6, వాల్మీకిపురంలో 20.2, నిమ్మనపల్లెలో 18.4, తంబళ్లపల్లెలో 12.0ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. రెండో రోజు. అత్యధికంగా బి.కొత్తకోట మండలంలో 95.4ఎంఎం, పీటీఎంలో 88.0, మదనపల్లె మండలంలో 81.0, కురబలకోట 60.4, తంబళ్లపల్లెలో 54.4 , ములకలచెరువులో 51.6, పెద్దమండ్యంలో 41.8, వాల్మీకిపురంలో 34.6, రామసముద్రంలో 31.0, కలికిరిలో 15.4ఎంఎం వర్షపాతం నమోదైంది.

సాధారణం కన్నా ఎక్కువగానే...!

మదనపల్లె డివిజన్‌లో గతేడాది నమోదైన వర్షపాతం కంటే ఈ సారి ఆగస్టు నెలలో ఎక్కువగా వర్షపాతం నమోదు అవుతోంది. గతేడాది మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పీటీఎం మండలాలో ఆగస్టులో 18ఎంఎం వర్షపాతం మాత్రమే నమోదు అయ్యింది. ఈ ఏడాది పోలిస్తే ఆగస్టులో 13 రోజుల్లో గతేడాది కంటే 100శాతం ఎక్కువగా నమోదు అయినట్లు తెలుస్తోంది.

లానినా ప్రభావమేనా..!

మదనపల్లె ప్రాంతంలో బుధ, గురువారాల్లో ఓ మోస్తరు వర్షాలు కురవనున్నాయని, శుక్ర, శని, ఆదివారాలు అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఇదే జరిగితే మదనపల్లె డివిజన్‌లోని చెరువులు జలకళ సంతరించుకోనున్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలోని వాయువ్య ప్రాంతాల్లో అధిక వర్షపాతం పడితే అన్నమయ్య జిల్లాలోని పెద్దేరు, బాహుదా ప్రాజెక్టులు నిండటంతో పాటు, జిల్లాలోనే అతి పెద్దదైన వ్యాసరాయసముద్రం, పీటీఎం పెద్దతిప్పసముద్రం చెరువులు నిండి మొరవపోయే అవకాశాలు వున్నాయి.

మొక్కుబడిగా 'సామాజిక తనిఖీ'!

● రూ.20,297 రికవరీకి ఆదేశం

కురబలకోట, ఆగస్టు 13: మండలంలో గత పదిరోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీ మొక్కుబడిగా జరిగిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి 13 పంచాయతీల పరిధిలో రూ. 6.84 కోట్ల నిధులతో 1543 పనులు జరిగాయి. వీటికి సంబంధించి కురబలకోట ఎంపీడీవో కార్యా లయంలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించి, తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలను వెల్లడించారు. మస్టర్లలో చిన్నచిన్న తప్పిదాలు, కొలతలలో తేడాల కారణంగా రూ.20,297 అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి రికవరీ చేయాలని ప్రొసీడింగ్ ఆఫీసర్ రవికుమార్ ఆదేశించారు. కాగా పలుచోట్ల మామిడి మొక్కలు చనిపోవడంతో ఆ మొక్కల స్థానంలో తిరిగి కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు పనులు జరిగిన ప్రదేశాలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు బి. జ్యోతి, ఏపీడీ మధుబాబు, విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఎస్ఆర్‌పీ సుబ్బారావు, ఎంపీడీవో హరినారాయణ, ఏపీవో వెంకటేష్, రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, మండల కన్వీనర్ వైజీ సురేంద్ర, టీడీపీ నేతలు రాఘవరెడ్డి, గుడే శ్రీనివాసులు, డిఆర్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్న అధికారులు

వర్షపు నీటితో విద్యార్థులకు ఇక్కట్లు

నిమ్మనపల్లి, ఆగస్టు 13: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణ మంగళవారం వర్షపు నీటితో నిండింది. దీంతో ఉపాధ్యాయులతో పాటు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు కనీసం ఆడుకునేందకు కూడా వీలు లేకుండా పోయింది. మండల విద్యాశాఖ కార్యాలయమే ఇలా ఉంటే పాఠశాలలు ఏవిధంగా వుంటాయో ఊహించుకోవలసిందే. దీనిపై ఎంఈవో-1 పద్మావతి వివరణ కోరగా రెండు రోజుల్లో మట్టి తోలి నీరు నిలువకుండా చూస్తామని తెలిపారు.

వాడవాడలా ఘనంగా తిరంగా ర్యాలీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు13: ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులఉ స్మరించుకున్నారు. ప్రతి పౌరుడు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలన్నారు. మదనపల్లెలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసమోడీ, ప్రేమకుమార్, మాదాస్ లేస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, భగవాన్, బండి ఆనంద్, జర్మనీ రాజు, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములకలచెరువు: ములకలచెరువులో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండు సర్కిల్ వరకు జాతీయ పతాకంతో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, ఎంఈవో వెంకటరమణ, ఈవోఆర్డీ హోహన్ ప్రతాప్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురబలకోట: మండలంలోని చేనేతనగర్ వద్దనున్న జ్యోతిరావు పూలే పాఠశాలకు చెందిన విద్యార్థులు వెయ్యి అడుగుల జాతీయ జెండాను ఊరేగించారు. ప్రిన్సిపాల్ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: జాతీయ జెండాతో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండలంలో పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలిచెర్ల జూనియర్ కాలేజీలో ప్రత్యేక సమావేశంలో నిర్వహించారు. పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఖాదర్‌బాష, జగన్, జనార్ధన, శైలజ, జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శపాఠశాల, కేజీబీవీ విద్యార్థులతో కలసి మండల విద్యాశాఖాధికారి నారాయణ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల నుంచి స్థానిక బస్టాండు వరకు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారంగా ఏర్పడి జైబోలో భారతమాతాకీజై అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంఈవో నారాయణ, మండల తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీవో కే.ఎన్. బాలాజీ, ఈవోపీఆర్డీ యోగానంద్‌తో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్న పాఠశాల ఉపాధ్యాయ, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడట్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామసముద్రం: మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్ కుమార్‌గౌడు, తహసీల్దార్ నిర్మలాదేవి, పోలీసులు, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చిట్టిబాబు, తూర్పు పాఠశాల హెచ్‌ఎం హేమలత, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్, గ్రామస్తులు, విద్యార్థులు తూర్పు పాఠశాల నుండి జడ్పీ హైస్కూల్ మీదుగా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు..



కురబల కోట: వెయ్యి అడుగుల జాతీయజెండాను ఊరేగిస్తున్న విద్యార్థులు

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

తంబళ్లపల్లె, ఆగస్టు 13: ప్రణాళికలతోనే పంచాయతీలు అభివృద్ధికి నోచుకుంటాయని రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ నాయక్ అన్నారు. సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం, వర్మీ కంపోస్టు తయారుచేసే ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో బదిలీలు

కలికిరి, ఆగస్టు 13: కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి సంబంధించి నాలుగు బదిలీలు చేశారు. మెకానికల్ హెచ్‌ఓడీగా పనిచేస్తున్న వి.నాగప్రసాద్ నాయుడును డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌గా అనంతపురం యూనివర్సిటీకి బదిలీ చేశారు. పులివెందుల కాలేజీలో పనిచేస్తున్న సీఈసీ విభాగాధిపతి ఆర్. రమణా రెడ్డిని అదే హోదాలో కలికిరికి, పులివెందుల కళాశాలలో ఈఈఈ విభాగాధిపతిగా వున్న జీవీ నగేష్‌కుమార్‌ను కలికిరి కళాశాలకు బదిలీ చేశారు. ఇక నాన్ టీచింగ్ విభాగంలో అనంతపురంలో డిప్యూటీ రిజిస్ట్రారుగా వున్న నాగరాణిని కలికిరి కళాశాల డిప్యూటీ రిజిస్ట్రారుగా నియమించారు. జేఎన్టీయూ రిజిస్ట్రారు కృష్ణయ్య ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

వరాల ఆంజనేయుడికి ఉసిరి కాయల అలంకరణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 13: శ్రావణ మంగళవారం సందర్భంగా స్థానిక బీటీ కళాశాల మైదానంలో ఉన్న వరాల ఆంజనేయుడికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఉసిరి కాయలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించు కున్నారు.

గుర్రంకొండ ఎంపీడీవోగా వెంకటేశులు

గుర్రంకొండ, ఆగస్టు 13:గుర్రంకొండ ఎంపీడీవోగా వెంకటేశులు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి గత నెలలో పదవీ విరమణ చేశారు. ఎన్నికల విధులపై పక్క జిల్లాకు వెళ్లిన వెంకటేశులు తిరిగి గుర్రంకొండ ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించారు

ములకలచెరువు తహసీల్దార్‌గా ప్రదీప్‌కుమార్

ములకలచెరువు, ఆగస్టు 13: ములకలచెరువు తహసీలార్‌గా ప్రదీప్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇక్కడ విధులు నిర్వహించిన అనిల్‌కుమార్ సొంత జిల్లాకు వెళ్లారు. దీంతో కలకడ నుంచి ఇక్కడ బదిలీపై వచ్చిన ప్రదీప్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు..

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

కలికిరి, ఆగస్టు 13: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలికిరి ఇన్‌స్పెక్టరు కె.రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషను వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడపడానికి సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయని వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు ఆటోల్లో ప్రయాణిస్తే పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క ఆటో పైన పోలీసు నంబరును అతికించాలని సీఐ చెప్పారు. అనంతరం మండలంలోని సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. సైబర్ నేరాలు, నకిలీ యాప్‌లపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించాలని సూచించారు. ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ కొండప్ప, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఆగస్టు 13: ప్రేమించిన వాడితో పెళ్లి చేయరేమోనన్న అనుమానంతో ఓ బాలిక ఆత్మహత్య చేసుకోగా, ఆమె మృత దేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా దహనం చేసిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. తంబళ్లపల్లి మండలం ఎగువబోయపల్లికి చెందిన హరినాథ్ కూతురు శ్వేత (17) అదే గ్రామానికి చెందిన వరుసకు సోదరుడయ్యే యువకుడిని ప్రేమించింది. గత నెల 22న ఇంటినుంచి వెళ్లిపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు గత నెల 27న తంబళ్లపల్లి పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దాంతో పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే, సోమవారం పొలం వద్దకు వెళతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది.

మంగళవారం పెద్దమండ్యం మండలం బండ్రేవు అడవిలో చెట్టుకు వేలాడుతూ ఆమె మృత దేహం లభ్యమైంది. కాగా, ఆమె మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారు. పరువు తీసిందనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులే ఇలా చేసి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు వీఆర్వో ఫిర్యాదు మేరకు పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం : 12 మంది అరెస్టు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 13: గంజాయి సేవిస్తున్న 12 మందిని అరెస్టు చేసి, రూ. 46 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు పట్టణ శివార్లలోని కోళ్లబైలు పంచాయతీ సమీపంలోని పొదల్లో కొందరు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో తాలూకా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో, తాలూకా, ఐడీ పార్టీ సిబ్బంది దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ శేఖర్, మదనపల్లె రూరల్ సీఐ రమేష్‌పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

వైసీపీ బాధితులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, ఆగస్టు 13: మండలంలోని వైసీపీ బాధితులకు రెవెన్యూ సదస్సుల్లో న్యాయం జరిగేలా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై మండల స్థాయి అధికారులు వీఆర్‌వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వైసీపీ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రదీప్‌కుమార్, ఎంపీడీవో పోలప్ప, ఎస్ఐ గాయత్రి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు విజయవంతానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ చంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 13: ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు అందించినట్లు వన్‌డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం వన్ డిపో గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగులు అభినందన సభ నిర్వహించారు. డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లుగా బీజే నాయక్, జేసీ కృష్ణయ్య, టార్గెట్ అచీవ్‌మెంట్‌లో జి. అమరావతి, బి కృష్ణ, డి, ఆంజనేయులు, ఈపీకే సాధించినవారు ఏహెచ్ కృష్ణ, వివిరమణ, చంద్రకళ, గ్యారేజ్‌లో టి, బాలకృష్ణ ప్రతిభ కనపరిచారన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 13: ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా పంపిణీ చేయాలని, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవణ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీం బాష డిమాండ్ చేశారు. ఈ మేరకు వీరి ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. నిర్మాణ రంగంలో పనులు చేస్తుతున్న కార్మికులు అన్ని విధాల ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుక రీచ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఆ ఇసుకను ఉచితంగా ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఈ నెల 19న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, తాపీ మేస్త్రీ వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజులు, బాలకృష్ణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, ఆగస్టు 13: తరిగొండ వెంగమాంబ వర్ధంతి సందర్భంగా గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం నిర్వహించారు. వెంగమాంబకు అర్చన, అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. వెంగమాంబ వంశస్తులు తెచ్చిన పట్టువస్త్రాలను అలంకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజగోపాల్, రమేష్, వెంగమాంబ వంశ స్తులు కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, గోకుల్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో తరిగొండ వెంగమాంబ

షూటింగ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె టౌన్, ఆగస్టు 13: చిత్తూరు జిల్లా వి.కోటలో ఈ నెల 10,11 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో అన్నమయ్య జిల్లా తరఫున పాల్గొన్న జిల్లా సబ్‌జూనియర్ బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గౌతమి తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డిప్రసాద్, రాయలసీమ షూటింగ్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ నరేష్‌బాబు, దిలీప్‌కుమార్ అభినందించారు.

పైర్ల వివరాలను నమోదు చేసుకోవాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 13: రైతులు సాగు చేసిన పైర్ల వివరాలను నమోదు చేసుకోవాలని మదనపల్లి ఏడీఏ శివశంకర్ కోరారు. మంగళవారం రెడ్డివారిపల్లి నిమ్మనపల్లి, కొండయ్యగారిపల్లి తదితర పంచాయతీల్లో పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పండిచిన వరి, వేరుశనగ పంటను పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్త లు వివరించారు. వేరుశనగలో సాళ్ల మధ్యలో మొక్కజొన్న, జొన్న వంటి పైర్లు వేయాలన్నారు జాగ్రత్తలు పాటించాలని, వరిలో కాండం తొలిచే పురుగుల నివారణకు వ్యవసాయ అధికారులు సలహాలు పాటించాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు అందించే విధంగా సింగల్ విండో, బ్యాంకులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళీమోహ న్, సహాయకులు నాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌కు అరుదైన గుర్తింపు..

కురబలకోట, ఆగస్టు 13: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ ఎస్థాయిలో అరుదైన గుర్తింపు దక్కిందని కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. విద్యాప్రమాణాలు, బోధన, అభ్యసనం, మూల్యాంకనం, పరిశోధనలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితర సదుపాయాలను పరిగణ లోకి తీసుకుని జాతీయస్థాయిలో కేంద్రవిద్యాశాఖ 13 విభాగాలలో ర్యాంకులను ప్రకటించగా అందులో మిట్స్ 201 నుంచి 300మధ్యలో గుర్తింపును దక్కించుకుందన్నారు. కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జయచంద్రారెడ్డిని కలిసిన అధికారులు

ములకలచెరువు, ఆగస్టు 13: తంబళ్లపల్లె నియోజకవర్గ టీ డీపీ నేత దాసరిపల్లి జయ చంద్రా రెడ్డిని మంగళవారం ములకలచెరువు ఎస్ఐ గాయత్రి, తహసీల్దార్ ప్రదీప్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ లను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు.



జయచంద్రారెడ్డిని కలిసిన తహసీల్దారు ప్రదీప్‌కుమార్

16న మడికయ్యల శివాలయంలో వరలక్ష్మీ వ్రతం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16: ఈ నెల 16న చిప్పిలిలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరస్వామి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్త్రీల సౌభాగ్యం కోసం చేసే వ్రతం కావున ఆసక్తి కలిగిన మహిళలు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

మల్బరీ సాగుపై ఆసక్తి చూపాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 13: రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి కనబరచాలని సిరికల్చర్ ఏడీఏ రామ మోహన్, మదనపల్లి డివిజన్ అధికారి రసూల్ సూచించారు. మంగళవారం సామకోటవారిపల్లి రైతుసేవా కేంద్రం వద్ద మల్బరీ సాగుపై రైతుల కు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బైవోల్టిన్ పట్టుపురుగులను పెంపకం గది ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ, ఓసీ రైతులకు 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చిన్నకారు రైతులకు కూడా ప్రోత్సాహకం అందిస్తునట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జబ్బార్ రైతులు, రెడ్డెప్పరెడ్డి. జయన్న, రామ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టి.సదుంలో పశువైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 13 : మండలంలోని టి.సదుం గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లె ఉప సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నట్టలు, గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. పశుపోషణలో జాగ్రత్తలను రైతులకు వివరించారు. గ్రామంలోని పశువుల కు టీకాలు వేశారు. 40 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 30 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ కార్యక్రమంలో బురకాయకోట అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్, పీటీఎం మండల పశువైద్యాధికారి బి.రమేష్‌నాయక్, లతో పాటు పశువైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

పెద్దమండ్యం, ఆగస్టు 13: మండలంలోని పసలవాండ్ల పల్లెలో మంగళవారం పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగిందని పెద్దమండ్యం పోలీసులు తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు పసలవాండ్లపల్లికు చెందిన ప్రమీల, లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు ఇళ్లకు తాళాలు వేసి పనులకు వెళ్లిన సమయంలో దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. ఇళ్లకు వేసిన తాళాలు పగులగొట్టి, బీరువాల్లో దాచిన నగలు, అపహరించుకు వెళ్లాడు. ప్రమీల ఇంట్లో 65 గ్రాముల బంగారం, రూ. ఒకటిన్నర లక్ష నగదు , లక్ష్మీదేవి ఇంట్లో 10 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదును అపహరించినట్లు భాదితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దుండగుడు పసుపు రంగు టీ షర్టు, నల్ల షార్ట్‌తో ద్విచక్రవాహనంలో వచ్చినట్లు గ్రామస్తులు వెల్లడించారు. పెద్దమండ్యం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.